
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 20 అక్టోబర్ 2023

5

ఏలూరు



బాలల రక్షణ అందరి బాధ్యత

ఏలూరు టౌన్:బాలల పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించడంతో పాటు, వారికి రక్షణగా ఉందామని నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఏలూరులోని భారత ఆహార సంస్థ గిడ్డంగుల ముఠా కార్మికులకు, శనివారపుపేటలోని బాలుర హోమ్‌లో బాలల పరిరక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు, యువత మందు, సిగరెట్, గంజాయి మొదలైన మత్తు పదార్థాలకు అలవాటు అవుతున్నారని దీన్ని అడ్డుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దగ్గర అవ్వడం, చిన్న వయస్సు నుండే నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వివరించారు. ఈ తరుణంలో విద్యార్థి దశ నుంచే సరైన అవగాహన కల్పిస్తే సమాజంలో మంచి పౌరులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమములో గిడ్డంగుల సంస్థ మేనేజర్ కట్టా కృష్ణ, యూనియన్ లీడర్ టి.వెంకటేశ్వరావు, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.నేహెమియా పాల్గొన్నారు.

రాలని చినుకు.. ఎండుతున్న పైరు..!



రెండు నెలలుగా జాడలేని వాన
వెంటాడుతున్న వర్షాభావం
మండుతున్న ఎండలు
రైతులు దిగాలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ ఏడాది వరుణుడి జాడలేకుండా పోయింది. వానాకాలం మూడు నెలల పాటు పుష్కలంగా కురవాల్సిన వర్షాలు అడపాదడపా తప్ప పట్టుమని పదిరోజులు కూడా కురవలేదు. మూడు నెలలుగా ఏరోజుకారోజు రైతన్న వర్షం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. చివరకు వానలు పడకుండానే వర్షాకాలం ముగిసిపోయింది. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చెరువుల్లో ఉన్నకాస్త నీరు కూడా అడుగంటిపోతుంది. ఇప్పటి వరకూ పంటను ఏదోలా కాపాడుకుంటూ వచ్చిన రైతన్న చేతికొచ్చిన పైరు ఎండిపోతుండటంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిప్రభావం పంట దిగుబడిపై పడుతుండటంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నాడు. వర్షకాలంలో కూడా ఎండలు మండిపోతున్నాయి. పొట్టదశకు వచ్చిన వరిపంట ఎండిపోతోంది. చెరువుల్లో ఉన్న కాస్త నీటిని మోటార్, ట్యూబులు తీసుకొచ్చి తోడుకుని పంటలు తడుపుతున్నారు. దీనికి అదనంగా డీజిల్‌కు, మోటార్, ట్యూబుల అద్దెలు భారీగా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.ఐదు వేల వరకూ అదనంగా ఖర్చవుతుందని తెలిపారు. ఇంత ఖర్చు చేస్తున్నా చివరకు పంట చేతికి వస్తుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చింతలపూడి మండలంలో 16 వేల ఎకరాలల్లో వరి పంట సాగుచేశారు. చెరువుల కింద 3,500 ఎకారాల ఆయకట్టు ఉంది. బోర్ల మీద ఆధారపడి 2,500 ఎకరాల్లో రైతులు పంటసాగుచేశారు. ప్రస్తుతం ఇవన్నీ పొట్టదశలో ఉన్నాయి. వర్షం పడితేనే ఈ పంటలన్నీ గట్టెక్కే పరిస్థితి ఉంది. లేకుంటే చెరువుల్లోని నీరు చాలక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. భూగర్భ జలాలు సైతం అడుగంటడంతో బోర్లలో నీటి లెవిల్ తగ్గిందని పలువురు రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ఎండల దెబ్బకు పంటకు నీరు పెట్టిన రెండు రోజులకే ఇంకిపోతుందని, పదేపదే తడపాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. దీంతో నీరు చాలక పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కనీసం కౌలు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండు, మూడు దుక్కుల వర్షం పడితేగానీ గట్టెక్కుతామని రైతులు భావిస్తున్నారు. వర్షాలు పడి దాదాపు రెండు నెలలు కావొస్తుండటంతో చెరువు కింద రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఆ చెరువులన్నీ అడుగంటాయి. పాతచింతలపూడి, సమ్మెటవారిగూడెం, మల్లయ్యగూడెం, రాఘవాపురం, గణిచర్ల, అంకురాయలకొత్తగూడెం, సీతానగరం, ప్రగడవరం గ్రామాల్లో వరిపంట మొత్తం దాదాపు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. భూములు నెర్రలు తీసి నీటికోసం ఎదురుచూస్తున్నాయి. ఆ పంటలను చూసి రైతులు లబోదిబోమంటున్నారు.

పది ఎకరాలు ఎండిపోతోంది

చీకటి మురళి, రైతు

చెరువు మీద ఆధారపడి నేను పది ఎకరాల్లో వరి పంట సాగుచేశాను. ప్రస్తుతం నీటి ఎద్దడితో పంట మొత్తం దెబ్బతింటోంది. చెరువుల్లో నీరు కూడా అడుగంటింది. ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

మీనాకుమారి, మండల వ్యవసాయాధికారి

ఈ ఏడాది వర్షాలు అనుకున్నంతగా పడలేదు. దీంతో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. పంటలు దెబ్బతిని నష్టపోయే పరిస్థితులు దాపురించాయని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ప్రతిగింజా కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశం
ఫిర్యాదులు వస్తే అధికారులపై చర్యలు
తేమ, నూకశాతంలో వ్యత్యాసం లేకుండా చూడాలి
గిరిజన ప్రాంతాల అభివృద్ధికి త్వరలో ఐటిడిఎలో సమావేశం
ఇసుక అక్రమరవాణాపై నిఘా
ఉమ్మడి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం కొనుగోలులో అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు ఫ్రెండ్లీ విధానంలో ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం ఉమ్మడి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రూ.ఆరు లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని అంచనా ఉందని, అందుకు తగిన విధంగా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నుండి ధాన్యం కొనుగోలులో రైతు భరోసా కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద వద్ద తేమ, నూక శాతం లెక్కింపులో వ్యత్యాసం ఉంటుందని, చిరిగిన గోనె సంచులు సరఫరా చేస్తున్నారని, ఆదేవిధంగా రవాణాకు వాహనాల ఏర్పాటులో కూడా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటన్నింటిని అధిగమించి రైతులు రైస్ మిల్లర్ల నుండి ఎలాంటి సమస్యలూ ఎదుర్కోకుండా కస్టోడియన్ అధికారులు మరింత బాధ్యతతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవిని జెడ్‌పి చైర్‌పర్సన్ ఆదేశించారు. ప్రతిమండలంలోనూ మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలను ఏర్పాటు చేసి, రైతు సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖాధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు విధానం అంతా ఆన్‌లైన్లో నిర్వహిస్తున్నప్పటికీ, అధికారులు ముందుగానే క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పెదపాడు, కైకలూరు తదితర మండలాల్లో కొన్ని శివారు భూములకు కృష్ణా కాలువ నుండి సాగు, తాగునీరు సక్రమంగా అందడం లేదని, వంతులవారీ విధానాన్ని సక్రమంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటికి ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, జలజీవన్ మిషన్లో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలును సమీక్షించేందుకుగాను ఐటిడిఎలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని పద్మశ్రీ తెలిపారు. అధికారులు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై, సంక్షేమ కార్యక్రమాల వివరాలను జెడ్‌పిటిసి సభ్యులకు, ఎంపిపిలకు, ఇతర ప్రజాప్రతినిధులకు కూడా సమాచారం అందిస్తూ వారిని సమన్వయం చేసుకుని పథకాల అమలును మరింత వేగవంతం చేయాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు కొంతమంది ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని, దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని గనుల శాఖ డిడిని ఆమె ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా నూరుశాతం ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించిన వారికి కళ్ళజోళ్లు అందించడం లేదని కొంత మంది సభ్యులు తెలియజేయడంతో, వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శర్మిష్టను ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుండి వివిధ ఆరోగ్య సమస్యలపై జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులను ఏలూరు ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా, ఎంతో దూరం నుండి వ్యయప్రయాసలకోర్చి వచ్చే ప్రజలను అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఏలూరు ఆసుపత్రికి రిఫర్ చేయకుండా మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలకు సిఫార్సు

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసమస్యలపై సమీక్ష నిర్వహించే జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని, గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని పద్మశ్రీ హెచ్చరించారు. ఏలూరులో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలకు పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలకు సంబంధించి కొందరు జిల్లాస్థాయి అధికారులు ముందస్తు అనుమతి తీసుకోకుండా సమావేశానికి రాకుండా తమ కింద స్థాయి అధికారులను పంపడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో స్థాయి సంఘ సమావేశంలో గృహనిర్మాణ శాఖ సమీక్షలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి హాజరు కాకపోవడం, ఆదేవిధంగా నాలుగో స్థాయి సంఘ సమీక్షలో పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశాలకు తప్పనిసరిగా జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు, హాజరు కానివారు శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, జెడ్‌పి వైస్‌చైర్‌పర్సన్ శ్రీలేఖ, విజయబాబు, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వజ్రకిరణ్

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

డివైఎఫ్ఐ సావనీర్ ఆవిష్కరణలో డాక్టర్ వజ్రకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రంలో యువత జూద క్రీడలకు, మాదకదవ్యాలకు, మద్యపానానికి లోనవ్వకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏరియా ఆసుపత్రి వైద్యులు వజ్రకిరణ్ సూచించారు. గురువారం ఏరియా ఆసుపత్రిలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అధ్యక్షతన డివైఎఫ్ఐ స్పెషల్ సావనీర్‌ను వజ్రకిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం సూత్రాన్ని అందరూ అనుసరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మహనీయుల ఆశయాలతో సేవా దృక్పథంతో స్వచ్ఛందసేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. యువత జూద క్రీడలకు, మాదకద్రవ్యాలకు లోనవ్వకుండా ఉండాలని తెలిపారు. నిరంతరం నిరుద్యోగ సమస్యపై పనిచేస్తున్న డివైఎఫ్ఐకి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో యువతను ఐక్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వెంకట్, పి.సుబ్బారావు, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

జీలుగుమిల్లి:సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ (కెఆర్‌పురం) కేథరిన్ అన్నారు. గురువారం జిల్లా మలేరియా నివారణ అధికారి సుధాకర్‌తో కలిసి స్థానిక పిహెచ్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏజెన్సీ పరిసర గ్రామాల్లో సీజనల్‌గా వచ్చే మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు రాకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో సమస్యాత్మక గ్రామాల్లో మలాథీయన్ పిచికారి చేయాలని, పారిశుధ్య పనులు విధిగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి, సిహెచ్‌ఒ శ్రీనివాసరాజు, ఫార్మాసిస్ట్ నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ మంగతాయారు, సువర్ణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు పిన్నిబోయిన వీరబాబు కోరారు. మండలంలోని నూగొండపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వంహించారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యుల సమక్షంలో 385 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, కె.మల్లీశ్వరీ, మండల ప్రత్యేకాధికారి జి.వెంకటరత్నం, ఎంపిడిఒ పి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, ఎంపిపి జి.అనూష, వైసిపి మండల అధ్యక్షులు పి.నరసింహారావు, సచివాలయాల కన్వీనర్ ఎస్.భాస్కర ప్రసాద్, వైసిపి నాయకులు కె.వెంకటేశ్వరరావు, జి.ఇస్సాక్ పాల్గొన్నారు.


కలిదిండి: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలందరికీ ఆరోగ్య భరోసా అని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పడమటిపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచులు సానా మీనా సరస్వతి, మసిముక్కు మారుతీ ప్రసన్న, సానా వెంకట రామారావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల చెంతకే కార్పొరేట్ వైద్య సేవలను తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. పెనుమల్లి గ్రామ సచివాలయ పరిధిలోజగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు శీల రామకృష్ణ, ఎంపిటిసి వి.కొండలరావు, పెనుమల్లి, సంకర్షణపురం సర్పంచులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా ఏలూరు అభివృద్ధి : నాని

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. 118వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం స్థానిక 34వ డివిజన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే లక్ష్యంతో రూ.361.55 కోట్ల అమృత్ నిధులతో ఏలూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. విలీన గ్రామాలు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. విలీన గ్రామాలకు గోదావరి జలాలతో సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, మేయర్ షేక్ నూర్జహాన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పాల్గొన్నారు.




దీక్షలో పాల్గొన్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

సిపిఎస్ రద్దు కోరుతూ నిరవధిక దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు ఏలూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద గురువారం ప్రారంభమయ్యాయి. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఈ దీక్షలను ప్రారంభించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు శిబిరానికి అధ్యక్షత వహించారు. జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ నాయకులు ఎ.సత్యనారాయణ, వివిధ ప్రజాసంఘాల నాయకులు రవి, ఆర్‌టిసి, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుంద రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, నాయకులు పి.కిషోర్, బి.సోమయ్య దీక్షలకు సంఘీభావం తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శి పి.విద్యాసాగర్ బాబు, నాయకులు ఎ.విక్టర్, సిహెచ్.శ్రీధర్, కె.కమల్ కుమార్, బి.మోహన్ రావు, మరీదు లక్ష్మణరావు, వి.రాంబాబు, కట్టా శ్రీనివాస్, ఐ.దుర్గాప్రసాద్, జి.రామారావు తొలిరోజు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాల్సిందిపోయి జిపిఎస్ అనే ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేయడం వల్ల లక్షలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. జెఎసి ఛైర్మన్ చోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ యుటిఎఫ్ పోరాటానికి జెఎసి, ఎన్‌జిఒల తరపున పూర్తిమద్దతు తెలుపుతున్నామన్నారు. తాముకూడా ఉద్యమంలోకి వస్తామని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2004 సెప్టెంబరు ముందు నియామక ప్రక్రియ పూర్తి చేసుకున్న వారందరికీ పాత పెన్షన్ అమలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ ఒపిఎస్ సాధన పోరాటంలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



డెమో చెక్కును అందిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

16,486 మందికి జగనన్న 'చేదోడు' లబ్ధి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద వరుసగా నాలుగో ఏడాది జిల్లావ్యాప్తంగా 16,486 మంది రజక , నాయీబ్రాహ్మణ, దర్జీలకు రూ.16.49 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 3,25,020 మంది రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు రూ.325.02 కోట్ల ఆర్థిక సాయాన్ని సిఎం జగన్ కర్నూరు జిల్లా ఎమ్మిగనూరు వేదికగా ఈ పథకం ద్వారా కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు ఏలూరు జిల్లాకు చెందిన 16,486 లబ్ధిదారులకు రూ.16.49 కోట్ల డెమో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో జగనన్న చేదోడు కింద షాపులున్న రజకులకు, నాయీ బ్రాహ్మణులకు, దర్జీలకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా చింతలపూడి నియోజకవర్గంలో 2,258 మంది లబ్ధిదారులకు రూ.1.15 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో 2,343 మంది లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు, ఏలూరు నియోజకవర్గంలో 2,377 మందికి రూ.83.50 లక్షలు, కైకలూరు నియోజకవర్గంలో 1,159 మందికి రూ.1.16 కోట్లు, నూజివీడు నియోజకవర్గంలో 3,303 మందికి రూ.1.82 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో 3,683 మందికి రూ.1.95కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 1,291 మందికి రూ.1.19 కోట్లు, గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలంలో 72 మందిరకి రూ.39.70 లక్షలు మంజూరు చేశారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో

ఆయిల్‌పామ్ ధర పతనం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గించడంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.18 వేలు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రజా, రైతాంగ సమస్యలపై తీర్మానాలు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ విదేశీ క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకం కేంద్ర ప్రభుత్వం ఎత్తి వేయడం వల్ల దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలు తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆగస్టులో రూ.12,900 ఉన్న గెలల ధర సెప్టెంబరులో రూ.12,122కు తగ్గించడం అన్యాయమన్నారు. గతేడాది టన్ను గెలలకు రూ.23 వేలు ఉంటే సగానికి ధర తగ్గిపోయిందన్నారు. విదేశీ వంట నూనెల దిగుమతితో ఆయిల్ పామ్ రైతులను దెబ్బతీయడం తగదన్నారు. టన్ను గెలలకు రూ.18 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మరోవైపు వ్యవసాయానికి కరెంటు కోతలు తీవ్రంగా ఉన్నాయన్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరి పొట్ట దశలో సాగునీరు ఇవ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సాగునీటి ఎద్దడిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయుల నిరాహార దీక్షకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. 2004లో పెన్షన్ విధానం రద్దు చేసినప్పటి నుండి దేశవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారని, ముఖ్యంగా రాష్ట్రంలో నాలుగైదేళ్లుగా ఉద్యమం సమరశీలంగా నడుస్తుందని ఈ పోరాటానికి సిపిఎం మద్దతు నిత్యం ఉంటుందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని గత ఎన్నికల్లో సిఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రజల సమస్యలపై ఈ నెల 30 నుండి సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రల్లో భాగంగా వచ్చేనెల ఆరో తేదీ సాయంత్రం మన జిల్లాలోని కుక్కునూరులో ప్రవేశించే బస్సు యాత్ర ఏడు, ఎనిమిది తేదీల్లో పోలవరం నియోజకవర్గ మండలాల్లో సాగుతూ హనుమాన్‌జంక్షన్ చేరుకుంటుందన్నారు. ఈ ప్రజారక్షణ భేరి యాత్రను, వచ్చేనెల 15న విజయవాడలో జరిగే బహిరంగసభను జయప్రదం చేసేందుకు జిల్లాలోని పార్టీ శ్రేణులు కదలాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, వై.నాగేంద్రరావు, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

చేనేత వస్త్రాల వినియోగం పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

భారతీయ చేనేత మన అమూల్య సాంస్కృతిక వారసత్వమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక సిఆర్‌ఆర్ కళాశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్కో చేనేత వస్త్రాలయాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచే చేనేత వస్త్రాల వినియోగం మరింత పెంచాలన్నారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను విరివిగా ధరించి నేత కార్మికులను ఆదరించాలని, చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా లక్షలాదిమంది కార్మికులు జీవనోపాధి చూపించవచ్చన్నారు. మారుతున్న అభిరుచులకు, జాతీయ అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ కళను, నైపుణ్యాన్ని చేనేత కళాకారులు మార్చుకుంటూ వస్తున్నారన్నారు. అలాంటి చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించేందుకు చేనేత వస్త్రాలను ధరించి ప్రోత్సహించాలని ప్రజలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో అడిషనల్ జనరల్ మేనేజరు కె.అప్పారావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు బి.హనుమంతరావు, బి.రామయ్య, ఎడిఒ జి.గుర్రాజు, ఆప్కో మాజీ డెరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నరేంద్ర కుటుంబానికి అండగా ఉంటాం

సంస్మరణ దినోత్సవంలో ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నరేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఆగిరిపల్లిలో విధి నిర్వహణలో ఉన్న సమయంలో దాడిలో మృతి చెందిన గంధం నరేంద్ర ఎస్‌పి డి.మేరీప్రశాంతి నివాళులర్పించారు. నరేంద్ర కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ తరపున సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత ప్రజాసేవకే ఎక్కువగా ప్రాముఖ్యత ఇచ్చే వ్యక్తిని కోల్పోవడం ఎనలేని లోటన్నారు. జిల్లా అదనపు ఎస్‌పి అడ్మిన్ ఎంజెవి. భాస్కరరావు మాట్లాడుతూ నరేంద్రకు ప్రభుత్వపరంగా పోలీస్ సిబ్బంది పరంగా అందాల్సిన రాయితీలు అన్నీ వచ్చేలా, నరేంద్ర భార్యకు ఉద్యోగ కల్పన కారుణ్య నియమకాల్ని త్వరగా అందించేలాగా చర్యలు తీసుకోవాలని ఎస్‌పిని కోరారు. ఎస్‌పి మేరీప్రశాంతి మాట్లాడుతూ గంధం నరేంద్ర మృతి తీరని లోటన్నారు. నరేంద్ర కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తనను ఎప్పుడైనా కలవవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్, పోలీసు సిబ్బంది నుంచి గంధం నరేంద్ర కుటుంబసభ్యులకు రూ.1,31,020 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిఎస్‌పి ఎం.రమేష్‌రెడ్డి, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, వన్‌టౌన్ ఎస్ఐ ఎన్.రాజశేఖర్, త్రీ టౌన్ ఎస్ఐ కోమాకల శివాజీ, నిడమర్రు సిఐ ఎం.సుభాష్, వెల్ఫేర్ మోడల్ ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి రూ.27 లక్షలు

సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల


సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ బేబీకమల

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ నిధులు, ఎపిఎంఐసిడిసి నుంచి ఆసుపత్రి నిర్వహణకు రూ.27 లక్షలు కేటాయించినట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల తెలిపారు. స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం డాక్టర్ బేబీకమల అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రికి రంగులు, గేట్ ఎంట్రెన్స్‌లో కాటిల్ రైలింగ్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్ రూమ్, రెండు ఎలక్ట్రికల్ పానల్ బోర్డ్స్, ప్రతి రూమ్ దగ్గర చెప్పుల స్టాండ్ ట్రాక్‌లు, దోభి గాట్ ఏర్పాటు సంబంధించిన షెడ్, పైపులైన్, ఎలిక్ట్రికల్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రికి రెండు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఎనిమిది వాటర్‌ట్యాంకులు, యుపివిసి పైపులైన్ సెట్టింగ్, మూడు జనరేటర్ షెడ్స్‌లు అవసరమైన పనులను చేయించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ నిధులు నుంచి సుమారు రూ.2 లక్షలతో ఎలీషా రీడర్, వాషర్స్ ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. కుక్కకాటుకు గురైన వారికి ఆసుపత్రి బయట ఎంట్రెన్స్‌లో వాటర్ పైపు, సబ్బు, లిక్విడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు రాపోలు బావనరుషి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులకు 2022 నుంచి 2023 వరకు నాలుగు సార్లు ప్రత్యేకతను సంతరించుకునట్లు తెలిపారు. గత నెలలో ఓపి పెషేంట్లు 8759, ఇన్ పెషేంట్లు 1763, డెలివరీలు 122 అయినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు కనపర్తి రాజేష్, సూపరింటెండెంట్ బేబీకమల, డాక్టర్ వజ్ర కిరణ్, శ్రీనివాసరావు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో అధికారుల భాగస్వామ్యం ఉండాలి

నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్


ముసునూరు : ఆరోగ్య సురక్షలో నూజివీడు సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ముసునూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అధికారులందరూ భాగస్వాములై ప్రజలకు సేవలందించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో సర్పంచి చలసాని దామెదరరావు, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఉపసర్పంచి దారగాని సుబ్బారావు, ఇఒపిఆర్‌డి బసవరాజు, అచ్యుత సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి : మండలంలోని తక్కెళ్లపాడులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీ రామదుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి చేబ్రోలు సుధారాణి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కాలి మోషే, బిసి నాయకులు చేబోయిన వీర్రాజు, ముంగర మల్లికార్జునరావు సైదు చంద్రయ్య పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రతి పేదవాడికి వైద్యం అందించాలనే ఉద్దేశంతో సిఎం జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. స్థానిక తొమ్మిదో సచివాలయం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రెండవ రోజు గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ ఎలిజా హాజరై మాట్లాడారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్లు కిషోర్, కటారి రాంబాబు, వైసిపి నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, షేక్ అమీర్, కంచర్ల విష్ణు, వైసిపి సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

టి.నరసాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు గొప్ప వరమని జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిడిఒ మంగాకుమారి, సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి సభ్యులు తోట శ్యామల, కలపర్తి సుజాత, పంచాయతీల విస్తరణాధికారి ఎంవిఎస్.రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో ఎంపిడిఒ ఆర్.బేబీశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో పలు విభాగాలను ప్రారంభించి భోజన సదుపాయం కల్పించారు.

చింతలపూడి : మండలంలోని పట్టాయగూడెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సరక్ష కార్యక్రమంలో 500 మంది వైద్య సేవలు పొందారని నామవరం సర్పంచి వెంకటేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ; డిప్యూటీ తహశీల్దార్ షకిలా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సమాచార హక్కు చట్టం వారోత్సవాలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజాస్వామ్యాన్ని ప్రజలే అమలు చేసుకునే విధంగా తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం ఆశయం అధికారుల నిర్లక్ష్యం వల్లే నీరు కారిపోతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు విమర్శించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం దినోత్సవాన్ని అధికారులు నామమాత్రంగా నిర్వహించడం దురదృష్టకరమన్నారు. చట్టం వచ్చి 18 ఏళ్లు గడుస్తున్నప్పటికీ పలు కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు అందుబాటులో లేవన్నారు. ప్రతినెలా శుక్రవారం ఆర్‌టిఐ దినంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆ విధంగా అమలు కావడం లేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

'నాకు మందులు ఇచ్చి కాపాడండి'

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన కొమ్ము ఆనందం ప్యాంక్రియాస్ గ్రంధి ఆపరేషన్ చేయించుకుని నెలనెలా మందులు వాడుతున్నారు. ప్రతినెలా మందులకు రూ.ఎనిమిది వేలు ఖర్చు అవుతున్నాయని, పేద కుటుంబమైన తాను మందులు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నానని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు పంపిణీ చేయాలని అర్జీ పెట్టుకున్నారు. మందులు పంపిణీ చేయలేదని, గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీ సమస్య పరిష్కారమైందని తెలిపారని కొమ్ము ఆనందం చెప్పారు. ఆయన స్పందించి మందులు ఇవ్వకుండా సమస్య ఎలా పరిష్కారమైందని మాట్లాడటంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులతో మాట్లాడమని సూచించారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోని అధికారులతో మాట్లాడుతూ తన వ్యాధికి సంబంధించిన మందులు పంపిణీ చేసి తనను కాపాడాలని కొమ్ము ఆనందం కోరారు.

వైఎస్ఆర్ పౌష్టికాహార స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పరింపుడి సచివాలయం-3 పరిధిలో వైఎస్ఆర్ పౌష్టికాహార స్టాల్‌ని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు గంజిమాల దేవి ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 40 రకాల వంటకాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

స్థలాల కేటాయింపు.. అంచనాలు పెంపు

ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ ప్రధాన అజెండాలివే - పలు అంశాలపై అభ్యంతరం తెలిపిన టిడిపి కార్పొరేటర్లు


మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

'ఏలూరు నగర పరిధిలోని విలువైన కార్పొరేషన్ స్థలాలను తక్కువ ధరకు కేటాయించడం... నిధులు పెంచుతూ తీర్మానాలను ఆమోదించడం.. అధికారపార్టీ అజెండాగా ఉంచిన అంశాలన్నీ ఆమోదమైనట్లు ప్రకటించుకోవడం..' ఇదీ ఏలూరు నగరపాలక సంస్థలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం తీరు. కొన్ని అంశాలపై టిడిపి కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేసినా 97 శాతం బలమున్న వైసిపి పాలకవర్గం తమ అంశాలను నెగ్గించుకోవడమే లక్ష్యమన్నట్టు వ్యవహరించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం గురు వారం స్థానిక కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి మేయర్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షత వహిం చారు. ఎజెండాలోని 22 అంశాలను సభ్యులందరూ ఏకగ్రీ వంగా ఆమోదించారు. టిడిపి కార్పొరేటర్లు అడిగిన మూడు ప్రశ్నలకు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు సమాధానం చెప్పడంతో టిడిపి మహిళా కార్పొరేటర్లు అర్థం చేసుకున్నారు.

విలువైన స్థలాలను కారుచౌకగా ఇవ్వొద్దు : చేపలతూము సెంటర్ వద్ద 1958-59 సంవత్సరంలో అప్పటి కార్పొరేషన్ ఉద్యోగి పి.చంద్రలీలమ్మకు ఎల్ఐజిహెచ్ కింద కేటాయించిన స్థలాన్ని ఆమె బంధువులకు రూ.28.01 లక్షలకు రిజిస్ట్రేషన్ చేయాలన్న అంశంపై టిడిపి కార్పొరేటర్ పృధ్విసారధి, మరో ముగ్గురు అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడ మార్కెట్ ధర గజం రూ.40 వేల నుంచి రూ.50వేల వరకూ ఉందని, అలాంటి స్థలాలను కారుచౌకగా కేటాయిస్తే ఎలాగని టిడిపి కార్పొరేటర్లు వాదిం చారు. డిప్యూటీ మేయర్ సుధీరబాబు జోక్యం చేసుకుని. ధరలు నిర్ణయించే హక్కు రిజిస్ట్రేషన్ వారికే ఉందని, వారు నిర్ణయించిన ధరనే నిర్ణయించామన్నారు. కో ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్ మాట్లాడుతూ వారు 50 ఏళ్లుగా అవే గృహాల్లో ఉంటున్నందున వారికే ఇవ్వాలని కోరారు. కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు మాట్లాడుతూ చంద్రలీలమ్మ అప్పటి కార్పొరేషన్ వేలంలో రెండు ఇళ్లు పాడుకుందని, అప్పట్లో కోర్టు కేసులు ఉండటంతో తీవ్ర జాప్యం అయిందన్నారు. స్పందనలో వారి కుమారులు, పిల్లలు ఇచ్చిన విజ్ఞప్తి మేరకు ధర నిర్ణయించామన్నారు. టిడిపి కార్పొరేటర్లు మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు.

కాపు కళ్యాణ మండపానికి 2313 చదరపు గజాల స్థలమా.?

ఏలూరులో వివిధ కుల సంఘాలకు స్థలాలను కేటాయిస్తూ తీర్మానాలు చేశారు. ఏలూరులోని శ్రీచౌడేశ్వరి మాత దేవల మహర్షి దేవాంగ సంఘానికి 382 చదరపు గజాలు, నూర్ బాషా దూదేకుల ముస్లిము సంక్షేమ సంఘానికి 300 చదరపు గజాలు, ఎపి బ్రాహ్మణ సేవా సమాఖ్యకు 441 చదరపు గజాలను మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో కేటాయిస్తూ తీర్మానాలు ఆమోదించారు. ఏలూరులోని ఐక్య కాపునాడు ఛారిటబుల్ ట్రస్ట్ వారి కోరిక మేరకు ఏలూరు పంపుల చెరువు వద్ద ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని కాపు కల్యాణ మండపం కోసమని 2313.88 గజాల స్థలాన్ని కేటాయిస్తూ 21వ అజెండాగా ఉంచి తీర్మానం పెట్టారు. దీనిపై టిడిపి కార్పొరేటర్ పృధ్వి శారద, మరో ఇద్దరు కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. మిగిలిన సంఘాలకు మదేపల్లిలో స్థలాలు కేటాయించి, కాపు కళ్యాణ మండపానికి మాత్రం ఏలూరు మధ్యలో విలువైన స్థలం కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే మిగిలిన వారికి 500 చదరపు గజాల లోపే స్థలం కేటాయించి కాపు కల్యాణ మండపానికి అంత కేటాయించడం భావ్యం కాదన్నారు. దానివల్ల మిగిలిన సంఘాలు అభ్యంతరం తెలిపే అవకాశం ఉందన్నారు. డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు కలగచేసుకుని ఏలూరులో 70 వేల మంది వరకు కాపు, తెలగ ప్రజలున్నారని, జనాభా సంఖ్య ఆధారంగా స్థలం కేటాయించామన్నారు. కో ఆప్షన్ సభ్యులు పెదబాబు మాట్లాడుతూ ఏళ్లతరబడి కోర్టు కేసులో ఉన్న ఆ స్థలంపై కేసు గెలిచి కార్పొరేషన్ హక్కు పొందిందన్నారు. ఎంఎల్ఎ ఆళ్ల నాని సూచన మేరకు కాపు కల్యాణ మండపానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు. దీనికి కార్పొరేటర్ల అందరి ఆమోదం ఉందన్నారు.

ప్రజాసమస్యలపై చర్చలేవీ

ఏలూరు నగరంలో అసలు సమస్యలే లేవన్నట్లు కౌన్సిల్ సమావేశంలో ప్రజాసమస్యలపై అసలు చర్చల ప్రస్తావనే కానరాలేదు. అజెండా అంశాలపై ఆమోదం తప్ప ఇతర అంశాలపై కార్పొరేటర్లు ఆసక్తి చూపలేదు. కనీసం జీరో అవర్ ఆలోచనే చేయలేదు. ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి జీరో అవర్ కావాలని ఎవరు కొరిన దాఖలాలూ లేవు. దీంతో సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయనే విమర్శలున్నాయి.

అవకతవకలు చేస్తే శిక్షించండి

ఏలూరు కార్పొరేషన్‌లో ఎలాంటి అవకతవకలకూ పాల్పడటం లేదని, అలా ఎక్కడైనా జరిగినట్లు భావిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు కౌన్సిల్ సాక్షిగా చెప్పారు. రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలో శాసనసభ్యులు ఆళ్ల నాని సహకారంతో సుమారు రూ.300 కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్, మేనేజర్, ఎసిపి, సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

సింధు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - ఏలూరు

సింధు ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఎస్‌సిటి డెంటల్ క్లినిక్ ప్రాంగణంలో గురువారం నిరాశ్రయులకు, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది పేదలు, నిరాశ్రయులు పాల్గొన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ జి.సింధూర, కుమారి, ఇ.శిరిజ, ట్రస్ట్ సలహాదారు జి.సాయిసుధాకర్, ట్రస్ట్ సభ్యురాలు ఎం.తారకేశ్వరి, ట్రస్ట్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులకు ట్రేలను అందిస్తున్న సుబ్బయ్య

ట్రేల్లో వేసిన నారుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పొగాకు పంటలో ట్రేలలో పెంచిన నారును వాడటం వాళ్ల అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని పొగాకు సిటిఆర్ఐ హెడ్ వై.సుబ్బయ్య తెలిపారు. సిటిఆర్ఐ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ ఉప ప్రణాళికలో భాగంగా స్థానిక రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రే లలో పెంచిన నారును పొగాకు పంట వేయడం ద్వారా ఎటువంటి కీటకాలు దరి చేరకుండా ఆరోగ్య కరమైన పంటలు పండే అవకాశం ఉందన్నారు. దాని ద్వారా మేలు రకమైన పంట పండి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా తేలికపాటి నెలలో ఎఫ్‌సిజె-11 అనే వంగడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ ఉప ప్రణాళికలో భాగంగా 80 మంది రైతులకు ఉచితంగా ట్రే లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫామ్ మేనేజర్ ఎంవి.జయకృష్ణ, సింహాచలం, అసిస్టెంట్ మేనేజర్ టి.రమేష్, ప్రభు, రైతులు పాల్గొన్నారు.

22 మంది రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వట్లూరులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో గురువరాం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 22 మంది యువత రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు స్వయం ఉపాధి శిక్షణతో పాటు, రక్తదానంపై అవగాహన పెరగాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పరచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, డి.శిరోమణి, బి.నరేంద్రకుమార్, పిఆర్ఒ కెవి.రమణ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

ఎరువులు, పురుగుమందుల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి షేక్ జరీనా హెచ్చరించారు. మండలంలోని లోకముడి లింగాల గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల షాపుల్లో గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎరువులతో పాటు నిల్వ రేటులు స్టాక్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. గడువులోపే లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని, ఎంఆర్‌పి ధరలకు మాత్రమే విక్రయించాలని ఆమె సూచించారు. ముఖ్యంగా ఎరువులను ఈపాస్ ద్వారానే అమ్మకాలు చేయాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు నిల్వ చేయాలని, కాలపరిమితి ముగిసిన వాటిని అమ్మకూడదని తెలిపారు. వ్యవసాయ శాఖ అనుమతించిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఎరువులు, పురుగుమందుల నాణ్యతలను పరిశీలించారు.

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యన్నగూడెంలో ఏర్పాటుచేసిన అంగనవాడీ సెక్టార్ పరిధిలోని పోషకాహార స్టాల్‌ను ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సందర్శించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.వెంకాయమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది తయారుచేసిన వంటకాలను నాణ్యతను, శుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గర్భిణులకు, తల్లులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి పోలవరం నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు గంజిమాల దేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ తాడిగడప రామకృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ సంకొండ, ఎంపిడిఒ బేబీశ్రీలక్ష్మి, ఎన్ఆర్ఇజిఎస్ డిపార్ట్‌మెంట్ ఎపిఒ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పెదపాడు

మండలంలోని ఏపూరులో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు కొంతమందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏపూరు గ్రామంలోని డంపింగ్ యార్డ్ చెరువు వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ చల్లా కృష్ణ తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో పలువురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,200 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. జీలుగుమిల్లి హెచ్‌పి గ్యాస్ గోడౌన్ వద్ద జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఉండి మండలానికి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాడి రైతులకు బోనస్‌లు

ప్రజాశక్తి - ముసునూరు

విజయ డెయిరీలో పాలు పోసే ప్రతి రైతును ప్రోత్సహించడానికి బోనస్‌లు పంపిణీ చేస్తున్నట్లు విజయ డెయిరీ కృష్ణ మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనే యులు తెలిపారు. మండల కేంద్రమైన ముసు నూరు విజయ పాల సొసైటీ కేంద్రం వద్ద అధ్యక్షు లు గాజుల ఏడుకొండలు పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో 327 మంది రైతులకు రూ.2,61,961, గోగులంపాడు పాల సొసైటీలో 210 రైతులకు రూ.7,25,500 గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీలో పాలు పోసే రైతులకు పలు రకాలగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ మాజీ అధ్యక్షులు చలసాని కుటుంబరావు, విజయ ఉమ్మడి కృష్ణా జిల్లా బోర్డు డైరెక్టర్ ఎస్.వెంకటశివజ్యోతి, మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.